క్లుప్తంగా

అన్నదానం



నెల్లూరు(అర్బన్): స్థానిక మద్రాస్ బస్టాండ్ పక్కన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా సెంటర్‌లో బుధవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. రెడ్‌క్రాస్ ఎంసీ మెంబర్ యాలమూరి రంగారావు ఆయన తండ్రి యాలమూరి రామచంద్రయ్యనాయుడు వర్ధంతి సందర్భంగా తలసేమియాతో బాధపడుతున్న పిల్లలు వారి తల్లిదండ్రులు, బంధువులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ఎంసీ మెంబర్ బయ్యా ప్రసాద్, తలసేమియా సెంటర్ కో–కన్వీనర్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమ దోపిడీ చేస్తే చర్యలు

నెల్లూరు సిటీ: ఎవరైనా బంధించి శ్రమను దోచుకునే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు ఆర్డీఓ అనూష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి జైలు శిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తామన్నారు.

ముగ్గురు పిల్లలకు విముక్తి

ఇటీవల జీజీహెచ్ ప్రాంగణంలో ఓ వృద్ధురాలు ఓ బాబుతో భిక్షాటన చేస్తూ కనిపించడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఆర్డీఓ అనూషకు సమాచారం అందించారు. వెంటనే బాలల సంరక్షణాధికారి సురేష్‌ను పంపించి విచారించగా ఆ బాబు వెంకటాచలం మండలం కాకుటూరు గ్రామానికి చెందిన కె.పెంచలయ్య, స్వప్న దంపతుల కుమారుడని గుర్తించారు. అదేవిధంగా వారికి చెందిన మరో ఇద్దరు పిల్లలు కూడా మరో వ్యక్తుల వద్ద పనిచేస్తున్నారని తెలుసుకున్నారు. ముగ్గురు పిల్లలను వారి నుంచి విముక్తి కల్పించారు. అనంతరం పనిచేయిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వంపై ఆధారపడకుండా వసతులు కల్పించాలి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం మీదే ఆధారపడకుండా సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం నెల్లూరుకు విచ్చేసిన ఆయన నగరంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమలు విస్తృతంగా ఉన్న దృష్ట్యా సీఎస్సార్ నిధుల ద్వారా వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతకుముందు వివిధ వర్గాల నాయకుల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పలువురికి ఉద్యోగోన్నతి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో నాలుగో తరగతి ఉద్యోగులుగా పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందికి రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ కమిషనర్ వైఓ నందన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఆర్.వెంకట్రావు (వాచ్ మెన్), ఎం.రమేష్ (పబ్లిక్ హెల్త్ వర్కర్), మరియమ్మ, వెంకటరమణ, పి.వరప్రసాద్, జాహెద్, కె.లక్ష్మి (అటెండర్లు)కు తాత్కాలిక ప్రాతిపదికన రికార్డ్ అసిస్టెంట్లుగా బాధ్యతలను కేటాయించారు.

నమ్మించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): ఫోన్‌పే చేస్తానని ఓ వ్యక్తిని నమ్మించి నగదు దోచుకెళ్లిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన శ్రీనివాసులు కృష్ణపట్నంలోని ఓ మెస్‌లో పనిచేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 28న ఆయన బీవీనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్లారు. సీడీఎం మెషీన్ వద్ద ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి రూ.25 వేలు ఫోన్‌పే చేస్తానని నమ్మించి శ్రీనివాసులు నుంచి రూ.25 వేల నగదు తీసుకున్నారు. ఫోన్‌పే చేసినట్లు చూపించి అక్కడి నుంచి చల్లగా ఉడాయించాడు. ఈ క్రమంలో శ్రీనివాసులు షాపింగ్ చేసేందుకు ఓ దుకాణానికి వెళ్లి బ్యాలెన్స్ చెక్‌చేయగా మైనస్‌లో ఉంది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు నిందితుడి కోసం గాలించినా ఫలితం లేకుండాపోయింది. ఈ మేరకు బుధవారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహుమతుల ప్రదానం



నెల్లూరు(బృందావనం): ఇటీవల నిర్వహించిన పద్య పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మూలాపేటలోని అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజంలో ప్రోత్సాహక బహుమతులు బుధవారం అందజేశారు. పెన్నా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కవితా ప్రవీణ మోపూరు పెంచలనరసింహం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య పాల్గొని, మాట్లాడారు. మాతృభాషపై ప్రతిఒక్కరూ మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం పోటీలు నిర్వహించిన కె.వెంకటస్వామిరెడ్డి, ప్రసాద్‌లతో పాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, మల్లెల శ్రీహరి, రమణయ్య, సరస్వతీ సమాజం ట్రస్టీ బాబురెడ్డి, వై.వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శ్రీనివాసులు, రఘు, గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

- ఎవరో ప్రోద్బలంతో స్థానిక వీఆర్వో సహకరిస్తున్నారు
- న్యాయం చేయాలని రూరల్ సమన్వయకర్త విజయకుమార్‌రెడ్డి వినతి



రైతులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఇద్దరు ఆక్రమణదారులు రైతులను బెదిరించి వారి పొలాలను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని, వారికి స్థానిక వీఆర్వో సహకరిస్తున్నారని, దీనిపై విచారించి తగిన న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రూరల్ రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్‌కు రైతులతో కలిసి ఆయన బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ మండలంలోని సజ్జాపురం గ్రామంలో 2012వ సంవత్సరంలో ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో కొందరు పేదలకు తలా 30 సెంట్ల భూమిని ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు వారి హద్దుల్లో వ్యవసాయం చేసుకుంటున్నారని, ఈ క్రమంలో ఇద్దరు ఆక్రమణదారులు వారిపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. భూమిని వదిలేసి వెళ్లాలని బెదిరిస్తున్నారన్నారు. దీనిపై వారు లోకాయుక్త కోర్టుకు వెళ్లగా విచారణలో ఎరగల కృష్ణయ్య అనే వ్యక్తి రైతుల పొలాలను ఆక్రమిస్తూ, హద్దులను చెరిపేస్తున్నారని నిర్ధారించి శిక్ష కూడా విధించిందన్నారు. ఈ మేరకు ఆయన రూ.12 వేల జరిమానా కూడా కట్టారన్నారు. అయినప్పటికీ వారి ఆగడాలు కొనసాగడంతో 11 మంది పట్టాదారులు కలెక్టర్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి కింది స్థాయి అధికారులను విచారణ చేయమని ఆదేశించారన్నారు. అయితే స్థానిక వీఆర్వో విచారణలో అర్జీదారులను పిలవకుండా మరో వ్యక్తుల ఫొటోలు పెట్టి తప్పుడు నివేదికను తహసీల్దార్‌కు సమర్పించారన్నారు. ఎవరో ప్రోద్బలంతో వీఆర్వో ఇలా చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పూర్తి హక్కులు కలిగిన పట్టాదారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నగరంలో ర్యాలీ చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బుధవారం నగరంలోని తడికలబజార్ సెంటర్, జలకన్య విగ్రహం నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుతో పాటు సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగరాధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ మనోజ్‌కుమార్, ఎం.అశోక్ మాట్లాడారు. నగరపాలక సంస్థలో టెండర్ల రద్దు కోసం 15 రోజులు సమ్మె చేయగా, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ నందన్ సమక్షంలో చర్చలు జరిపి టెండర్లు రద్దు చేస్తున్నామని, సమ్మె కాలం జీతం ఇస్తామని హామీలు ఇచ్చారన్నారు. అయితే నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. దీంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కమిషనర్‌కు తెలియజేసినప్పటికీ లేఖల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. స్వచ్ఛాంధ్ర పేరుతో పెద్ద ఎత్తున ప్రచార డబ్బాలు కొట్టుకుంటూ కార్మికుల సమస్యలను మాత్రం గాలికి వదిలేశారని విమర్శించారు. తక్షణమే ఇచ్చిన మాట ప్రకారం సమ్మె కాలం జీతాలు చెల్లించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. డీవైఎఫ్‌ఐ నగర కార్యదర్శి బీపీ నరసింహ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మట్టిపాటి శ్రీనివాసులు, తాళ్లూరి లోకేష్, జయకుమార్, చంద్రమ్మ, రాంబాబు, షేక్.షబ్బీర్, షఫీ, రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



స్క్రీనింగ్ పరీక్షల వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈ నెలాఖరు వరకు ఉచిత బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆస్పత్రి రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ లోకేశ్వరి తెలిపారు. అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను హాస్పిటల్‌లో బుధవారం ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, గైనకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పల్లంరెడ్డి యశోధర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ కేన్సర్‌పై భయాన్ని తొలగించేందుకు, తాము ఉచిత స్క్రీనింగ్ పరీక్షలతో పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ స్క్రీనింగ్‌లో కేన్సర్ స్పెషలిస్ట్ కన్సల్టేషన్‌తో పాటు మామోగ్రఫీ, పాప్‌స్మియర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్(సీబీపీ) లాంటి పరీక్షలు చేస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు 040–6833 4455 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. హైకోర్టు అడ్వొకేట్ జలదంకి దీప్తిలక్ష్మి, జేసీఐ ఉమెన్స్ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, మెడికవర్ హాస్పిటల్స్ క్లస్టర్ హెడ్ రంజిత్‌రెడ్డి, సెంటర్ హెడ్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నెల్లూరు (టౌన్): ఎన్‌సీసీ 10ఏ నావల్ యూనిట్ గుంటూరులో నిర్వహించిన పలు పోటీల్లో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ బి.దత్తాత్రేయ తెలిపారు. ఈ మేరకు స్థానిక నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతనెల 23వ తేదీ నుంచి ఈనెల 3వ తేదీ వరకు ఎన్‌సీసీ క్యాట్‌సీ క్యాంపులో ఎండీ అదీల్లా బెస్ట్ క్యాడెట్ అవార్డు, వికాస్ సాంస్కృతిక విభాగంలో, బోట్ సైలింగ్‌లో బంగారు పతకాలు సాధించినట్లు చెప్పారు. అదే విధంగా తేజస్విరెడ్డి, హర్ష, యశ్వంత్, వికాస్, అదీల్లా సికింద్రాబాద్‌లో నిర్వహించే క్యాంపునకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

తొమ్మిదో రోజుకు చేరిన డాక్టర్ల సమ్మె



నెల్లూరు(అర్బన్): తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని 52 పీహెచ్‌సీల్లో డాక్టర్లు చేస్తున్న సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరించిన డాక్టర్లు బుధవారం నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ల పట్ల ప్రభుత్వ వైఖరి దారుణంగా ఉందన్నారు. సుమారు 25 ఏళ్లుగా ఒకే కేడర్‌లో పని చేస్తున్నప్పటికీ ఎలాంటి పదోన్నతులు లేకపోవడం దారుణమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కాగా డాక్టర్లు సమ్మెతో గ్రామీణ ప్రాంతాల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ భర్త అరెస్ట్

- బెయిల్‌పై విడుదల

నెల్లూరు(క్రైమ్): ఓ సివిల్ కేసులో మాజీ కార్పొరేటర్ భర్త తురకా సూరిబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కార్మిక్ నగర్‌లో మూడెకరాల తొమ్మిది సెంట్ల భూమిని సూరిబాబు ఆక్రమించారని దయాకర్‌రెడ్డి అనే వ్యక్తి రెండునెలల కిందట వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం సూరిబాబును అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

మెప్మాలో దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలి



మెప్మా పీడీ లీలారాణికి వినతిపత్రం అందజేస్తున్న కాలేషా

నెల్లూరు(బారకాసు): జిల్లాలోని అన్ని మెప్మా కార్యాలయాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ అమలు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాలేషా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం నగరంలోని మెప్మా కార్యాలయంలో పీడీ లీలారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. జీఓ నంబర్ 43 ప్రకారం దివ్యాంగులకు కూడా ఉద్యోగావకాశాలు కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని మెప్మా మిషన్ డైరెక్టర్ నుంచి సర్క్యులర్ పంపించినప్పటికీ జిల్లాలో అలాంటి ప్రయత్నం జరగడం లేదన్నారు. ఇకనైనా దివ్యాంగుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



నెల్లూరు సిటీ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. రూరల్ పరిధిలోని వెంగళరావునగర్ అంగన్‌వాడీ కేంద్రంలో హ్యాండ్ వాష్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా సఖీల నియామకానికి చర్యలు

నెల్లూరు(పొగతోట): సామాజిక భద్రత, బీమా సఖీ యోజన అమలుకు అర్హులైన స్వయం సహాయక గ్రూపు మహిళల నుంచి బీమా సఖిలను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఆర్థిక సాధికారతను పెంపొందించడం, బీమా సేవలు విస్తరణ చేయడం కోసం బీమా సఖిలను నియమించనున్నట్లు తెలియజేశారు. గ్రూపు మహిళల్లో అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి నియమిస్తామన్నారు. మూడు సంవత్సరాల పాటు స్టైఫండ్ ఉంటుందన్నారు. మొదటి సంవత్సరం రూ.7 వేలు, రెండో ఏడాది రూ.6 వేలు, మూడో సంవత్సరం రూ.5 వేలు ఇస్తామన్నారు. వీరు ఏడాదికి కనీసం 24 జీవిత బీమాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. మహిళలు 18 నుంచి 70 ఏళ్ల లోపు కలిగి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

కాలువలపై నిర్మాణాలు చేపట్టకుండా పర్యవేక్షించాలి

నెల్లూరు(బారకాసు): డ్రైయిన్ కాలువలను దాటి మెట్లు, ర్యాంపులు తదితర ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా సంబంధిత అధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. స్థానిక 37వ డివిజన్ రామ్‌నగర్ ప్రాంతం జీఎన్టీ రోడ్డులో నూతనంగా నిర్మించిన కాలువలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. కాలువల నిర్మాణ దశలోని క్యూరింగ్ ప్రక్రియ పనులను పూర్తి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రోడ్డును ఆక్రమించేలా చేపట్టిన నిర్మాణాలు, దుకాణాలను తప్పనిసరిగా తొలగించి వేయాలని ఆదేశించారు. అన్ని ప్రాంతాల్లో కాలువల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రధాన మురుగు కాలువలకు అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్కను అందజేశారు.

వక్ఫ్ భూముల పరిశీలన

నెల్లూరు సిటీ: నగరంలోని పరమేశ్వరి నగర్‌లో జామియా మసీదుకు చెందిన వక్ఫ్ భూమిని ముస్లిం నాయకులు, మతపెద్దలతో కలిసి వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులను కాపాడేందుకు కృషి చేస్తానని తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని పొట్టేపాళెంలో ఆదివారం రాత్రి ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వేణు విలేకరుల సమావేశం నిర్వహించారు. అరెస్ట్ చేసిన వారిలో ఇద్దరు మైనర్లు కాగా, మరో వ్యక్తి సోమశిల ప్రాంతానికి చెందిన సూర్య అని తెలిపారు. మైనర్‌లను బాలనేరస్తుల గృహానికి పంపగా, సూర్యను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు పంపామన్నారు. కాగా పాతకక్షల నేపథ్యంలో వారు హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలియజేశారు.

వేదగిరి ఉత్సవ కమిటీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు సిటీ: రూరల్ మండలంలోని వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా శంకర్‌రెడ్డితో పాటు పది మంది సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ గోపి, సిబ్బంది పాల్గొని వారికి అభినందనలు తెలిపారు.

పారదర్శకంగా పని చేయండి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్‌కు పూలమొక్కను అందజేస్తున్న ఎంపీడీఓలు

నెల్లూరు(పొగతోట): పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన అధికారులు పారదర్శకంగా పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ప్రొటోకాల్ తప్పని సరిగా పాటించాలని తెలిపారు.

డీకేడబ్ల్యూలో జీఎస్టీ 2.0పై అవగాహన



విద్యార్థినులకు సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు (టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ వేడుకలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎస్టీ 2.0పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం దీనిపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో చెంగాలీ (ప్రథమ), ఎస్డీ హుదాభాను (ద్వితీయ), హన్సిక (తృతీయ) బహుమతులు సాధించారు. వీరికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గిరి, వైస్ ప్రిన్సిపల్ రమణారావు, అర్థశాస్త్ర అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, చెంచురామయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ విభాగాధిపతి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి

- సీనియర్ సివిల్ జడ్జి వాణి



వృద్ధులకు అందుతున్న ఆహారాన్ని రుచి చూస్తున్న జడ్జి వాణి

నెల్లూరు(అర్బన్): వృద్ధులను వారి బిడ్డలు, మనుమలు, మనుమరాళ్లు తప్పకుండా ఆదరించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వాణి అన్నారు. నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న హరిత వృద్ధుల ఆశ్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. వృద్ధులకు అందుతున్న ఆహారాన్ని రుచి చూశారు. వారు వినియోగిస్తున్న బాత్‌రూమ్‌లు, అందుతున్న మందులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. నేటి కాలంలో వృద్ధులను బిడ్డలు నిర్లక్ష్యం చేయడం హేయమైన చర్య అన్నారు. కొంతమంది వృద్ధులను ఇంటి నుంచి గెంటివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలోని వారి కోసం 2007లో సీనియర్ సిటిజెన్ల పోషణ సంక్షేమ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. తల్లిదండ్రుల నుంచి ఆస్తులను పొందిన వారి బిడ్డలు తప్పకుండా పోషణ బాధ్యతలను చూడాలన్నారు. అలా చూడకపోతే న్యాయసేవాధికార సంస్థకు ఫిర్యాదు చేయాలని కోరారు. అప్పుడు తాము న్యాయం చేస్తామన్నారు. ఆధార్, రేషన్‌కార్డులు లేని వృద్ధులు తమకు తెలిపితే వాటిని అందేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ మేనేజ్‌మెంట్ సిబ్బంది నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై కఠిన చర్యలకు డిమాండ్



నిరసన తెలుపుతున్న మాల ఉద్యోగ సంఘ నేతలు, బీటీఏ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన దుండగులను, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై బూటు విసిరిన లాయర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాల ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు ఇంగిలాల మదన మిత్ర, మాల ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు నూకలపాటి రమణయ్య, శివ డిమాండ్ చేశారు. నగరంలోని మాల ఐక్యవేదిక కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం దేవరపాళెం మండలం దేవళ్లమిట్ట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని తగులబెట్టిన దుండగులను గుర్తించి వెంటనే శిక్షించాలన్నారు. అలాగే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై బూటు విసిరిన కిశోర్ అనే లాయర్ ఊపా చట్టంపై అరెస్ట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల ఉద్యోగ సంఘ సభ్యులు, బీటీఏ సభ్యులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల మంజూరు వేగవంతం



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని వెంకటేశ్వరపురం, అల్లీపురం కల్లూరుపల్లి, కొండ్లపూడి, అక్కచెరువుపాడు ప్రాంతాల్లో నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న టిడ్కో గృహాలను అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసేందుకు చర్యలను వేగవంతం చేయాలని కమిషనర్ వైఓ నందన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల మంజూరుపై హౌసింగ్ విభాగం అధికారులతో ఎస్ఎంసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారుల సంఖ్య, నూతనంగా నిర్మించిన గృహాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అర్హులైన లబ్ధిదారులందరికీ టిడ్కో గృహాలను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టిడ్కో గృహాలకు తాగునీరు, రోడ్లు, వీధిదీపాలు, పచ్చదనం, మొక్కల పెంపకం, రవాణా సౌకర్యం తదితర మౌలిక సదుపాయాలను కల్పించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, టీపీఆర్ఓ వాసుబాబు, వార్డు కోఆర్డినేటర్లు, హౌసింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రమోషన్లలో రిజర్వేషన్ల అమలుకు వినతి



ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మందా బాబ్జీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్‌ను బుధవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నూతన ఉద్యోగాల భర్తీ, ఉద్యోగ పదోన్నతుల్లో దళిత వర్గానికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై ఆదరణ చూపాలి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): హెచ్‌ఐవీ బాధితులపై డాక్టర్లు, వైద్యసిబ్బంది ఆదరణ చూపి చికిత్సలు అందించాలని జిల్లా ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్టీ విభాగంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణపై పనిచేస్తున్న ఎన్జీఓలతో కలిసి బుధవారం సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ చికిత్స కోసం వచ్చిన వారికి పూర్తిస్థాయిలో సహకరించి మందులు ఇవ్వాలని సూచించారు. ఇప్పుడు హెచ్‌ఐవీకి మంచి మందులను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోందన్నారు. మందులను సక్రమంగా వాడటం వల్ల వారి జీవితం దీర్ఘకాలికంగా పొడిగించుకోవచ్చన్నారు. అనంతరం జిల్లాలో ఉన్న హెచ్‌ఐవీ బాధితుల సంఖ్య, మందులు తీసుకుంటున్న వారి సంఖ్య, హెచ్‌ఐవీతో మృతిచెందిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది శివ, కిరణ్, వరలక్ష్మి పాల్గొన్నారు.